విద్యార్థులు అత్యున్నత స్థాయికి ఎదగాలి

● జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మంజూరి హుస్సేన్

వేములవాడ రూరల్, జనవరి 12: విద్యార్థులు ఒక ఉన్నత లక్ష్యాన్ని ఏర్పరచుకొని, ప్రణాళికాబద్ధంగా చదివి జీవితంలో అత్యున్నత స్థాయిలో స్థిరపడడానికి నిరంతరం కృషి చేయాలని జేఎన్‌టీయూ హైదరాబాద్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మంజూరి హుస్సేన్ కోరారు. శుక్రవారం వేములవాడ మండలం అగ్రహారం జేఎన్‌టీయూ కళాశాలలో ఆరంబ్ కార్యక్రమంలో భాగంగా ఫ్రెషర్స్ డే, జాతీయ యువజన దినోత్సవ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అగ్రహారం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వడ్లూరి శ్రీనివాస్, సురేశ్‌బాబు, ధీరజ్, బాలరాజు, ప్రసన్న, బాస్కర్, రంజిత్, శ్రావణ్, రవికుమార్ పాల్గొన్నారు.

పోలీస్ అధికారుల బదిలీ

తెలంగాణ చౌక్, జనవరి 12: జిల్లాలోని పలువురు పోలీస్ అధికారులు శుక్రవారం బదిలీ అయ్యారు. ఈ మేరకు సిరిసిల్ల పట్టణంలోని టౌన్ సీఐ బి ఉపేందర్ ఐజీ ఆఫీస్‌కు బదిలీ అయ్యారు. కాగా జిల్లా డీసీఆర్బీలో విధులు నిర్వహిస్తున్న బి రఘుపతి పట్టణ సీఐగా నియామకమయ్యారు. బోయినపల్లి ఎస్ఐ మహేందర్, రుద్రంగి ఎస్ఐ రాజేశ్‌ను ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌కు అటాచ్ చేస్తున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు.

ప్రత్యామ్నాయ ఇంధన వనరులు వినియోగించాలి

● ఎన్‌పీసీ డైరెక్టర్ రజనీకాంత్ ● సౌరశక్తి వినియోగంపై అవగాహన

రాజన్న సిరిసిల్ల, జనవరి 12(నమస్తే తెలంగాణ): పెట్రోలు, డీజిల్ వినియోగాన్ని తగ్గించుకుంటూ ప్రత్యామ్నాయ ఇంధన వనరులను వినియోగించుకోవాలని నేషనల్ ప్రొడక్టవిటీ కౌన్సిల్ బ్యూరో ఎనర్జీ ఎఫిషియన్సీ డైరెక్టర్ రజినీకాంత్ పిలుపు నిచ్చారు. శుక్రవారం జిల్లా గ్రంథాలయంలో ఐటీఐ విద్యార్థులు, ఎలక్ట్రీషియన్ వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యుత్, బ్యాటరీలు, సోలార్లను ఎక్కువగా వినియోగించుకోవాలని సూచించారు. బొగ్గు, పెట్రోలు, డీజిల్‌పై ఆధారపడకుండా ఉండేందుకు సౌరశక్తి ఎంతో మేలన్నారు. విద్యుత్ చార్జీలు తగ్గించుకోవచ్చన్నారు. విద్యుత్ ఉపకరణాలు కొనుగోలు చేసే విషయంలో స్టార్ రేటింగ్ చూసుకోవాలన్నారు. ప్రతి ఎలక్ట్రానిక్ వస్తువులపై 5స్టార్ నాణ్యత ఉండేలా చూసుకోవాలన్నారు. విద్యుత్ ఎలా ఆదా చేసుకోవాలో వినియోగదారులకు అవగాహన కల్పించాలని ఎలక్ట్రీషియన్లకు సూచించారు. సౌరశక్తి వినియోగించుకునే వారికి ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందన్నారు. పట్టణాల్లో సౌరశక్తి వినియోగం పెరిగిందని తెలిపారు. రైళ్లు, బస్సులు, వివిధ వాహనాలు సైతం సౌరశక్తినే వినియోగిస్తున్నాయన్నారు. పెట్రోలు, డీజిల్ భవిష్యత్తులో అందుబాటులో ఉండవని, అందుకే ప్రత్యామ్నాయ ఇంధన వనరులపై ప్రజలకు అవగాహన కల్పించేలా కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య మాట్లాడారు. సోలార్ వినియోగం చాలా మంచిదన్నారు. విద్యుత్ ఆదా చేసుకోవచ్చని సూచించారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలో సౌరశక్తి ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కాగా సౌరశక్తిపై అవగాహన కల్పించిన ఇల్లంతకుంట జడ్పీహెచ్ఎస్ విద్యార్థులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కరీంనగర్ రెడ్కో అధికారులు లక్ష్మీకాంత్, పరమానంద్, పాముల దేవయ్య, రీసోర్స్‌పర్సన్ గన్నమనేని శ్రీనివాసరావు, ఎలక్ట్రీషియన్ జిల్లా అధ్యక్షుడు మేర్గు అంజయ్య, ప్రధాన కార్యదర్శి యార సిద్ధిరాములు, ఎలుక కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సౌరశక్తి వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను సన్మానిస్తున్న రెడ్కో సంస్థ అధికారులు

కేటీఆర్ క్రికెట్ కప్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు

హోరాహోరీగా..కేటీఆర్ క్రికెట్ కప్ టోర్నమెంట్

సిరిసిల్ల టౌన్, జనవరి 12: మదీన యూత్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సిరిసిల్లలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శుక్రవారం నిర్వహించిన 'కేటీఆర్ కప్ క్రికెట్' టోర్నమెంట్ హోరాహోరీగా సాగింది. నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు బ్యాటింగ్ చేసి టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మదీన యూత్ వెల్ఫేర్ సొసైటీ నిర్వాహకులు ఐదేండ్లుగా సిరిసిల్లలో టోర్నమెంట్లు నిర్వహిస్తూ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారని అభినందించారు. విజేతకు రూ.20వేలు, రన్నరప్ జట్టుకు రూ.10వేలు బహుమతి ఉంటుందన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ జిల్లాలో క్రీడల ప్రోత్సాహానికి విశేష కృషి చేశారన్నారు. 23వ వార్డులో మినీ స్టేడియాన్ని అందుబాటులోకి తెచ్చారని, అదే విధంగా స్టేడియంలో వా లీబాల్ అకాడమీని ఏర్పాటు చేశారని తెలిపారు. రూ.2.50 కోట్లతో ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, త్వరలోనే అందుబాటులోకి తెచ్చేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ కౌన్సిలర్ గెంట్యాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను అర్హులైన వారికి అందజేయాలి

● కేంద్ర టెక్స్‌టైల్స్ మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి, వికసిత్ సంకల్ప యాత్ర జిల్లా నోడల్ అధికారి అజయ్ గుప్తా

కోనరావుపేట/బోయినపల్లి, జనవరి 12: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని కేంద్ర టెక్స్‌టైల్ మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి, వికసిత్ సంకల్ప యాత్ర జిల్లా నోడల్ అధికారి అజయ్ గుప్తా అన్నారు. కోనరావుపేట మండలంలోని మల్కపేటలో జానకీదేవి ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో కలెక్టర్ అనురాగ్ జయంతితో కలిసి పాల్గొన్నారు. అలాగే బోయినపల్లి మండలం అనంతపల్లిలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ సమర్థ్ కార్యక్రమం ద్వారా టైలరింగ్, జూకి, ఎంబ్రాయిడరీ, స్టిచ్చింగ్ మహిళలకు స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇస్తుందన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం ద్వారా ప్రధాన మంత్రి ఉజ్వల పథకం కింద 700మంది కొత్తగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని వారందరికీ ఇవ్వాలని పౌరసరఫరాల శాఖ అధికారులకు సూచించా రు. పథకాల లబ్ధిదారులను సన్మానించారు. డ్రోన్‌తో పురుగుల మందును పిచికారి చేయడం బాగుందన్నారు. ప్రకృతి వ్యవసాయ సాగులో పండించిన పంటల ఉత్పత్తులతో ఏర్పాటు చేసిన స్టాళ్లను, కూరగాయలతో వేసిన ముగ్గులు, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం, వంట గ్యాస్ వంటి స్టాళ్లను సందర్శించారు. ఆయిల్ పామ్, నానో యూరియా, స్ప్రే, ఉజ్వల పథకం, ఆయుష్మాన్, ఉపాధి హామీ పథకం, ఐసీడీఎస్ పోషణ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, జడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి, డీఆర్డీవో శ్రీనివాస్, టెక్స్‌టైల్స్ ఎండీ సాగర్, పౌర సంబంధాల శాఖ జిల్లా అధికారి జితేందర్‌రెడ్డి, మిషన్ భగీరథ ఈఈ జానకి, వ్యవసాయ జిల్లా అధికారి భాస్కర్, లీడ్ బ్యాంకు మేనేజర్ మల్లికార్జున్, సర్పంచులు ఆరె లత, సత్యనారాయణరెడ్డి, ఎంపీడీవోలు, ఎంపీవోలు ఉన్నారు.

కోనరావుపేట: మల్కపేటలో డ్రోన్‌ను పరిశీలిస్తున్న అజయ్ గుప్తా

రాజన్న సన్నిధిలో భక్తుల సందడి

వేములవాడ టౌన్, జనవరి 12: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి సన్నిధిలో శుక్రవారం భక్తుల సందడి నెలకొన్నది. రద్దీ మామూలుగా ఉండడంతో భక్తులకు గర్భగుడి అర్చిత సేవలకు అనుమతించారు. స్వామివారికి కోడె మొక్కు, అభిషేకాలు, నిత్యకల్యాణ అర్చిత సేవల ద్వారా సుమారు రూ.12లక్షల లక్షల ఆదాయం సమకూరింది. వేములవాడ రాజన్నను శుక్రవారం కేంద్ర టెక్స్‌టైల్ మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి, వికసిత్ భారత్ సంకల్ప యాత్ర జిల్లా నోడల్ అధికారి అజయ్ గుప్తా కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అనంతరం వారికి అర్చకులు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం గావించారు.

వేములవాడ రాజన్న ఆలయంలో భక్తుల సందడి

ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియపరచటం ఏమనగా నా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, సిరిసిల్ల శాఖ గారు. శ్రీ ఏడుమ్మకల వినోద్, S/o ఇస్తారి, ఫాజిల్‌నగర్ గ్రామం, వేములవాడ మండలం, రాజన్న సిరిసిల్ల జిల్లా గారికి వ్యాపార నిమిత్తం ఋణ సదుపాయం కల్పించుచున్నారు. ఇట్టి విషయములో తన యొక్క స్వంత ఆస్తి అయిన ఖాళీ స్థలం, దీని యొక్క విస్తీర్ణం: 363 చ॥గ॥, మరియు దీని యొక్క సర్వే నెం. 205/ఆ, ఫాజిల్‌నగర్ గ్రామం, వేములవాడ మండలం, రాజన్న సిరిసిల్ల జిల్లా నా క్లయింట్‌కు పై ఋణ విషయములో తనఖాగా పెట్టి పై ఆస్తికి సంబంధించిన ఒరిజినల్ దస్తావేజులు అప్పగించినారు.కావున ఇట్టి ఆస్తిపై ఎవరికైనా ఎలాంటి హక్కులు కానీ ఆక్షేపనలు కానీ వ్యాజములు ఉన్నచో ఈ ప్రకటన వెలువడిన 7 దినములు లోగా తగు దస్తావేజులతో నా కార్యాలయమునకు వచ్చి సంప్రదించగలరు. లేనిచో ఎవరికి అభ్యంతరాలు లేవని ధృవీకరించబడును.

తేది: 12-01-2024 స్థలము: సిరిసిల్ల.

ఇట్లు: Sd/- పెన్నింటి అశోక్, అడ్వకేట్, ఇ.నెం.3-7-852/1. వావిలాలపల్లి,కరీంనగర్ సెల్: 9849331558

నమస్తే తెలంగాణ CLASSIFIED

PLOT FOR SALE

★Residential Plot 2250 Sq. yards for Sale in Prime Residential Area at Near SRR College, Jagityal Road, Karimnagar Town. Ph: 9703544199.

NT-319319

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 91827 77571 91827 77194

చీరెల టెండర్లకు ముగ్గురే కాంట్రాక్టర్లు

● సిండికేట్ అయినట్లు ఆరోపణలు

వేములవాడ, జనవరి 12: వేములవాడ రాజన్న, అనుబంధ ఆలయాల్లో 2024-26 వరకు అమ్మవార్లకు సమర్పించే చీరెలు, బియ్యం సేకరణ టెండర్లకు ముగ్గురే కాంట్రాక్టర్లే హాజరయ్యారు. అధికారులు శుక్రవారం వేలం పాటతో పాటు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించారు. రూ. 83లక్షలతో వేలంపాటను నిర్వహించగా, శ్రీనివాస్ అనే గుత్తేదారు రూ. 95 లక్షలకు పాడి ఆగిపోయారు. దీంతో టెండర్లు తెరువగా సిద్దార్థ అనే కాంట్రాక్టర్ రూ.కోటి 1 లక్ష, 11రకు కోడ్ చేయడంతో ఆయనకే కేటాయించినట్లు అధికారులు ప్రకటించారు. అయితే కరోనా కాలంతో పోల్చితే కేవలం రూ. 18 లక్షలు మాత్రమే అధికం. అయితే కేవలం బియ్యం సేకరణ ద్వారా రెండేండ్ల క్రితం రూ. కోటికి పైగా ఆదాయం సమకూరింది. ప్రస్తుతం బియ్యం, చీరెల సేకరణ హక్కులను కేవలం రూ. 1.01కోట్లకే దక్కించుకోవడాన్ని చూస్తే కాంట్రాక్టర్లు సిండికేట్ అయినట్లు అర్థమవుతున్నది. గుత్తేదారులకు అధికారుల అండదండలు ఉన్నాయని ఆరోపిస్తున్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

ఇల్లంతకుంట, జనవరి 12 : పలు గ్రామాల్లో వారం రోజులుగా సామాజిక తనిఖీ కొనసాగుతున్నది. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీపీ వెంకటరమణారెడ్డి అధ్యక్షతన ఉపాధి హామీ పనులపై తనిఖీ చేపట్టారు.

ఆర్‌వో, వాటర్ రిఫ్రిజిరేటర్ వితరణ

సిరిసిల్ల రూరల్, జనవరి 12: సిరిసిల్లలోని పిల్లల డాక్టర్ సురేంద్రబాబు తంగళ్లపల్లి మండలం మండెపల్లి శివారులోని ప్రభుత్వ వయో వృద్ధుల ఆశ్రమానికి ఆర్‌వో, ఎస్ఎస్ రిఫ్రిజిరేటర్‌ను అందించారు. అదే విధంగా 20 దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ అరుణ్ భాస్కర్, సర్పంచ్ శివజ్యోతి ఉన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

కోనరావుపేట, జనవరి 12: నిమ్మపల్లికి చెందిన విక్కుర్తి సత్తయ్య ఇటీవల మృతిచెందగా బాధిత కుటుంబానికి పలువురు సాయం అందజేశారు. శుక్రవారం ఫ్రెండ్స్ యూత్ సభ్యులు, సర్పంచ్, ఉపసర్పంచ్, ఎంపీటీసీలు రూ.22వేలు, గౌడ సంఘం సభ్యులు రూ.13వేల ఆర్థిక సహాయాన్ని అందించారు.

బాలుడిని పరామర్శించిన మనోహర్‌రెడ్డి

బోయినపల్లి, జనవరి 12: కోరెం గ్రామానికి చెందిన పదిహేనేళ్ల బాలుడు రోమాల క్రాంతి గ్యాస్ట్రో ఎంట్రలజి సమస్యతో బాధపడుతూ హైదరాబాద్‌లో చికిత్స చేసుకుని ఇంటికి చేరుకున్నాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి శుక్రవారం రోమాల క్రాంతిని పరామర్శించారు.

సంక్రాంతికి ఊరెళ్తున్నారా...భద్రం

తెలంగాణ చౌక్, జనవరి 12: సంక్రాంతి పండుగకు ప్రజలు తమ ఊళ్లకు వెళ్తే జాగ్రత్తలు పాటించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ శుక్రవారం ప్రకటన ద్వారా సూచించారు. దూర ప్రయాణాలు చేసే వారు తమ ఇంటి చిరునామాతో సహా ఫోన్‌నంబర్లు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో తెలుపాలని సూచించారు. అలాగే చుట్టు పక్కల వారికి సమాచారం అందజేయాలన్నారు.

ఈనెల 22 వరకు ఓటు నమోదుకు అవకాశం

● ఓటరు నమోదు అధికారి, ఆర్డీవో ఆనంద్‌కుమార్ ● వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

కలెక్టరేట్, జనవరి 12: ఓటు నమోదుకు ఈనెల 22 వరకు గడువు ఉందని, జనవరి 1, 2024 వరకు 18 ఏండ్లు నిండిన వారు ఓటరుగా నమోదు కావాలని ఓటరు నమోదు అధికారి, ఆర్డీవో ఆనంద్‌కుమార్ తెలిపారు. శుక్రవారం సిరిసిల్ల ఆర్డీవో కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు నమోదుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో ఆనంద్‌కుమార్ మాట్లాడారు. ఈనెల 20, 21 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కలదని పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌వోలు అందుబాటులో ఉంటారన్నారు. ఫారం-8(మార్పులు, చేర్పులు), ఫారం-7(తొలగింపు)కు సంబంధించి ఫారాలు ఇవ్వవచ్చునని వెల్లడించారు. అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ నుంచి గజభీంకార్ రాజన్న, సీపీఐ నుంచి నాగరాజు, వైఎస్ఆర్‌సీపీ నుంచి కరుణాకర్ పాల్గొన్నారు.

క్రీడలతో విద్యార్థులకు మానసికోల్లాసం

● ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ రూరల్, జనవరి 12: క్రీడలతో విద్యార్థులకు మానసికోల్లాసం కలుగుతుందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లిలో వాలీబాల్ జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. టోర్నమెంట్‌ను ప్రారంభించిన అనంతరం ఆది శ్రీనివాస్ మాట్లాడారు. గ్రామీణ క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించే ఆటల్లో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో ఆటలు ముందుంటాయన్నారు. రానున్న రోజుల్లో నియోజకవర్గంలో రాష్ట్రస్థాయి వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహిస్తామన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ హన్మవ్వ, ఉమ్మడి జిల్లా వాలీబాల్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు వేణుకిషన్, వాలీబాల్ అసోసియేషన్ రాష్ట్ర జాయింట్ కార్యదర్శి లక్ష్మణ్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీకుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు రాంచందర్‌గౌడ్, కోచ్ రాంప్రసాద్, జగన్, దేవయ్య, కౌన్సిలర్ మహేశ్ పాల్గొన్నారు.

వేములవాడ, జనవరి 12: పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం డైరీ, క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆవిష్కరించారు. జిల్లా సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసరావు, కిషన్, రాష్ట్ర సంఘ బాధ్యులు ఉన్నారు.

శాత్రాజుపల్లిలో వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ప్రభుత్వ, విప్ ఆది శ్రీనివాస్

క్రీడలను నిర్వహించడం అభినందనీయం

సిరిసిల్ల రూరల్, జనవరి 12: డైనమిక్ ఫౌండేషన్ సభ్యులు క్రీడా పోటీలను నిర్వహించడం అభినందనీయమని తంగళ్లపల్లి ఎంపీపీ మానస, ఎస్ఐ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. తంగళ్లపల్లి మండలం జిల్లెల్లలో శుక్రవారం డైనమిక్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, సామాజిక సేవకార్యకర్త దుబ్బాక రమేశ్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీపీ, ఎస్ఐ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు మధు, ప్యాక్స్ చైర్మన్ భాస్కర్‌గౌడ్, వైస్ చైర్మన్ వెంకటరమణారెడ్డి ఉన్నారు.అలాగే తంగళ్లపల్లి మండలం గండిలచ్చపేటలో నాలుగు రోజుల నుంచి జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతగా కర్రోళ్ల బాలయ్య టీం నిలిచింది. సర్పంచ్ నీరటి లక్ష్మీ ఆధ్వర్యంలో విజేత జట్టుకు రూ.5వేలు, రన్నరప్ జట్టుకు రూ.2500 నగదు, కప్‌ను అందజేశారు.

ముస్తాబాద్, జనవరి 12: క్రీడా పోటీల్లో యువత గెలుపోటములను తీసుకోవాలని పోతుగల్ మార్కెట్ కమిటీ చైర్మన్ అక్కరాజు శ్రీనివాస్ పేర్కొన్నారు. పోతుగల్‌లో ఇటీవల మృతి చెందిన గాలిగాని దినేశ్, జంగ శ్రీనివాస్ జ్ఞాపకార్థం మండల స్థాయి స్మారక క్రికెట్ టోర్నమెంట్‌ను శుక్రవారం ప్రారంభించారు.

పోతుగల్‌లో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్

ఘనంగా గోదా రంగనాథుల కల్యాణం

వేములవాడ రూరల్/ఎల్లారెడ్డిపేట, జనవరి 12: వేములవాడ రూరల్ మండలం ఎదురుగట్లలోని వేంకటేశ్వరస్వామి ఆలయం, ఎల్లారెడ్డిపేటలోని గోదా రంగనాథ స్వామి ఆలయంలో గోదా రంగనాథ స్వామి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణాల్లో ప్రత్యేక వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులను అలంకరించి పూజలు చేశారు. ఎదురుగట్లలో బీఆర్ఎస్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు తిరుపతి, ఎంపీపీ మల్లేశం, సర్పంచ్ కరుణాకర్, ఆలయ చైర్మన్ గంగరాజు, ఎంపీటీసీ నర్సవ్వ, ఎల్లారెడ్డిపేటలో ఆలయ కమిటీ చైర్మన్ గడ్డం జితేందర్, వైస్ చైర్మన్ గంట వెంకటేశ్ స్వామి వారిని దర్శించుకున్నారు.

కమనీయం.. కుడారై ఉత్సవం

కుడారై ఉత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు, పాల్గొన్న భక్తులు

సిరిసిల్ల టౌన్/గంభీరావుపేట, జనవరి 12: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సిరిసిల్లలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయం, గంభీరావుపేటలోని సీతారామస్వామి ఆలయంలో నిర్వహించిన 'కుడారై ఉత్సవం' కనుల పండువగా జరిగింది. వేదపండితులు కుడారై ఉత్సవ ప్రాధాన్యాన్ని భక్తులకు వివరించారు. గంభీరావుపేటలో 108 పాత్రలలో పాయసాన్ని ఉంచి గోదా రంగనాథ స్వామి వారికి నైవేద్యం సమర్పించారు. కాగా మూడు రోజులుగా నిర్వహించిన అధ్యయన ఉత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. మహిళలు సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. సిరిసిల్లలో ఈవో మారుతిరావు, ఏఈవోలు ప్రభాకర్, రవీందర్ పాల్గొన్నారు.

బయోడైవర్సిటీ భూముల కేటాయింపుపై నిరసన

సిరిసిల్ల రూరల్, జనవరి 12: కాంగ్రెస్ ప్రభుత్వం జారీ చేసిన జీవో 55ను వెంటనే రద్దు చేయాలంటూ తంగళ్లపల్లి మండలం జిల్లెల్లలోని వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఆందోళన చేపట్టారు. ఈమేరకు శుక్రవారం కళాశాల ఎదుట ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. జీవో 55తో యూనివర్సిటీలోని భూములను హైకోర్టుకు కేటాయిస్తు జీవో జారీ చేశారన్నారు. దశాబ్దాల కాలం నుంచి ఎన్నో పరిశోధనలకు కేంద్రమైన విశ్వవిద్యాలయాలను విచ్ఛిన్నం చేయకూడదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే జీవో 55ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

ముస్తాబాద్, జనవరి 12: తాళం వేసిన ఇంటికి కన్నం వేసి ఇంట్లో పెట్టిన బంగారు, వెండి ఆభరణాలు, నగదు దోచుకెళ్లిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. ముస్తాబాద్‌కు చెందిన ఆర్టీసీ డ్రైవర్ బిట్ల వెంకటేశ్ కటుంబసభ్యులతో కలిసి బుధవారం ఇంటికి తాళం వేసి బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లాడు. శుక్రవారం ఉదయం కుటుంబసభ్యులు ఇంటికి రాగా, తాళం పగులగొట్టి ఉంది. దీంతో ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తలుపులు తెరిచి ఉండడం, వస్తువులు చిందరవందరగా ఉన్నాయి. బీరువాలోని 8 తులాల బంగారు, 20 తులాల వెండి ఆభరణాలు, నగదు చోరీ అయ్యాయి. విషయాన్ని ముస్తాబాద్ పోలీసులకు తెలుపగా, ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి ట్రాన్స్‌ఫార్మర్లు

ముస్తాబాద్, జనవరి 12: వినియోగదారులకు విద్యుత్ సమస్యలు తలెత్తకుండా గ్రామాల్లో అవసరం ఉన్న చోట అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నామని సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి పేర్కొన్నారు. నామపూర్‌లో సెస్ నిధులతో ఏర్పాటు చేసిన రెండు ట్రాన్స్‌ఫార్మర్లను శుక్రవారం సర్పంచ్ విజయ, జడ్పీటీసీ నర్సయ్యతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సుధాకర్‌రావు, అనిల్, నారాయణ, వకీలుద్దీన్, సురేశ్, రైతులు, సెస్ సిబ్బంది పాల్గొన్నారు.

విజ్ఞాన విహార యాత్రకు గోరంటాల విద్యార్థులు

గంభీరావుపేట, జనవరి 12: గోరంటాల జిల్లా పరిషత్, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు శుక్రవారం విజ్ఞాన విహార యాత్రకు తరలి వెళ్లారు. సిద్దిపేట జిల్లాలోని వర్గల్ సరస్వతీ అమ్మవారి ఆలయం, హైదరాబాద్‌లోని వండర్‌లా తదితర పర్యాటక ప్రాంతాలను సందర్శించి, విద్యార్థులకు అవగాహన చేశామని పాఠశాల హెచ్‌ఎంలు మనోహర్‌రెడ్డి, బాలరాజు తెలిపారు.

వివేకానందుడి బోధనలు అనుసరణీయం

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, జనవరి 12: జిల్లాలో స్వామి వివేకానందుడి 161 వ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల, పార్టీల నాయకులు, యువజన సంఘాల నాయకులు వివేకానందుడి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివేకానందుని జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని అతని బోధనలు అనుసరణీయమని వక్తలు గుర్తు చేశారు. ఆయనను ఆదర్శంగా తీసుకోని ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. క్రమశిక్షణ, పరిపూర్ణ వ్యక్తిత్వ వికాసం పెంపొందించుకొని తమవంతుగా సమాజ సేవ చేయాలని సూచించారు. వేములవాడ పట్టణంలో యువ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 2కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

చందుర్తి: మల్యాలలో వివేకానందుడి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సీఐ కిరణ్‌కుమార్

సిరిసిల్ల టౌన్: బతుకమ్మ ఘాట్ వద్ద ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న డీఈవో రమేశ్‌బాబు, కమిషనర్ అయాజ్

ముందస్తు సంక్రాంతి వేడుకలు

సిరిసిల్ల టౌన్/రుద్రంగి/ఎల్లారెడ్డిపేట/గంభీరావుపేట, జనవరి 12 : సిరిసిల్లలోని స్థానిక బతుకమ్మ ఘాట్ వద్ద గోపా పట్టణాధ్యక్షుడు నాగుల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీకి విశేష స్పందన లభించింది. జిల్లా విద్యాధికారి రమేశ్‌బాబు, కమిషనర్ అయాజ్, గోపాల జిల్లా అధ్యక్షుడు అమరేందర్‌గౌడ్ విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో గోపా జిల్లా కోశాధికారి బాలగౌడ్, ఉపాధ్యక్షుడు పాముల దేవయ్యగౌడ్, బుర్ర శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షుడు అంజాగౌడ్, నాగరాజుగౌడ్, మహేశ్‌గౌడ్ పాల్గొన్నారు. రుద్రంగిలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఎల్లారెడ్డిపేటలోని అల్మాస్‌పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బొమ్మల కొలువులు, సోది చెప్పడం, గాలిపటాలు ఎగురవేశారు. గంభీరావుపేటలోని ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల ఆవరణను ముగ్గులు, పూలు, మామిడి ఆకులతో సంప్రదాయంగా అలంకరణ చేసి భోగి మంటలు, గంగిరెద్దులు ఆయా వేషధారణల మధ్య పండుగను జరుపుకున్నారు.

తంగళ్లపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో శుక్రవారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. 1997-98 సంవత్సరానికి చెందిన పదో తరగతి విద్యార్థులు 26 సంవత్సరాల తర్వాత ఒకచోట కలిసి గత స్మృతులు నెమరు వేసుకున్నారు. – సిరిసిల్ల రూరల్, జనవరి 12